క్లుప్తంగా

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



హీరోయిన్ లావణ్య త్రిపాఠి, హీరో నవీన్ చంద్ర, కొరియోగ్రఫర్ బాబా భాస్కర్

తిరుమల: తిరుమల శ్రీవారిని హీరోయిన్ లావణ్య త్రిపాఠి, హీరో నవీన్ చంద్ర, సినీ కొరియోగ్రఫర్ బాబా భాస్కర్ శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

రామయ్యకు వెండి ఆభరణాల వితరణ



వెండి ఆభరణాలను ఆలయ అధికారులకు అందజేస్తున్న దాతలు

చంద్రగిరి: స్థానిక శ్రీకోదండరామ స్వామివారి ఆలయంలో కొలువైన స్వామివారికి దాతలు వెండి ఆభరణాలను దాతలు విరాళంగా అందజేశారు. స్థానిక చంద్రగిరికి చెందిన సుశీల, నాదముని రెడ్డి 642 గ్రాముల బరువు గల సుమారు రూ.78 వేల విలువైన వెండి కిరీటం, కర్ణపత్రాలను విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు. ఈ మేరకు అధికారులు దాతలకు స్వామివారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేసి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, ఇన్‌స్పెక్టర్ ముని హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 108 కేసులు పరిష్కారం



కేసులను పరిష్కరిస్తున్న జడ్జి పూర్ణిమాదేవి

పాకాల : స్థానిక కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 108 కేసులు పరిష్కారమయ్యాయి. శనివారం న్యాయమూర్తి పి.పూర్ణిమాదేవి అధ్యక్షతన జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేసుల పరిష్కారం ద్వారా కక్షిదారులకు రూ.27,11,857 లబ్ధి చేకూరినట్లు తెలిపారు. ప్రజలు కోర్టుల చుట్టూ తిరిగి తమ సమయాన్ని వృథా చేసుకోకుండా లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు గురుస్వామినాయుడు, గౌరీశంకర్‌రాజు, చంద్రమోహన్, రెడ్డెప్పనాయుడు, సుబ్రమణ్యంరెడ్డి, ప్రవీణ్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లకార్డుల ప్రదర్శన



డెయిరీ ఏర్పాటు చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీసీ సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం సొంతంగా డెయిరీ ఏర్పాటుకు సిద్ధమైతే తాను వెయ్యి ఆవులను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని పుంగనూరుకు చెందిన బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ ప్రకటించారని, ఈ మేరకు టీటీడీ పాలక మండలి డెయిరీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవాలని బీసీ సంఘ నేత శ్రీనివాసులు యాదవ్ విజ్ఞప్తి చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీటీడీ సొంత డెయిరీకి చర్యలు తీసుకోవాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ మేరకు రాష్ట్ర సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి లేఖలు ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు డెయిరీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీసీ సంఘ నేతలు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌ను అడ్డుకున్నందుకు దాడి

సైదాపురం: అక్రమ మైనింగ్‌ను అడ్డుకున్నందుకు తనపై దాడి చేశారని మండలంలోని తుమ్మలతలుపూరుకు చెందిన శ్రీనివాసులు చౌదరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతను మాట్లాడుతూ తుమ్మలతలుపూరు సమీపంలోని చావటిప్ప వద్ద నిల్వ ఉన్న ఖనిజాన్ని శుక్రవారం రాత్రి శ్రీకాంత్ రవాణా చేస్తుండడంతో తాను అడ్డుకున్నానని తెలిపారు. దీంతో శ్రీకాంత్, అతని అనుచరులు తనపై దాడి చేశారని వాపోయాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం కొత్తకన్నలిలో ప్రసూతి ఆస్పత్రి, శ్రీ వెంకటేశ్వర మెడికల్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, అవగాహన సదస్సు నిర్వహించారు. రాస్ సంఘాల మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. డాక్టర్ సునీత మాట్లాడుతూ మహిళల్లో సంభవించే పలు రకాల క్యాన్సర్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు, నివారణ చర్యలను వివరించారు.



చిన్నారులకు పోస్ట్ బాక్స్‌పై అవగాహన కల్పిస్తున్న తల్లిదండ్రులు



ఇట్లు ప్రేమతో.. అమ్మానాన్నలకు..



అంతరించిపోతున్న పోస్ట్‌కార్డ్, ఇన్‌లాండ్ లెటర్లు, ఉత్తరాలకు పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా పోస్టల్ శాఖ చేపట్టిన 'ధాయ్ అఖర్'కు విశేష స్పందన లభిస్తోంది. తపాలాశాఖ నిర్వహిస్తోన్న ఈ కార్యక్రమానికి విద్యార్థులు, ప్రజల స్పందిస్తున్నారు. వ్యాసరచన పోటీల్లో పాల్గొంటున్నారు. అలాగే నగరంలోని పలు స్కూళ్లకు చెందిన విద్యార్థులు, నగర ప్రజలు తిరుపతిలో హెడ్‌పోస్టాఫీసుకు క్యూ కడుతున్నారు.

- తల్లిదండ్రులకు లేఖలు రాసిన చిన్నారులు
- తిరుపతి హెడ్ ఫోస్టాఫీసు వద్ద సందడి
- అంతరించిపోతున్న పోస్ట్‌కార్డు, ఇన్‌లాండ్ లెటర్లపై చిన్నారులకు అవగాహన
- దగ్గర ఉండి పోస్ట్‌కార్డులను పోస్ట్‌డబ్బాలో వేయించిన తల్లిదండ్రులు
- చిన్నారుల ఉత్సాహం చూసి ఆశ్చర్యపోయిన ఉద్యోగులు, స్థానికులు
- సాక్షి కథనానికి విశేష స్పందన
- 'దాయ్ అఖర్' పోటీలకు జనవరి 31 వరకు గడువు



సాక్షి

జ్ఞాపకాలను మరువ లేఖ

ఈ నెల 5న సాక్షి ప్రచురితమైన ప్రత్యేక కథనం

తిరుపతి సిటీ: పోస్టాఫీసుతో తమకు ఉన్న అనుబంధంతో పాటు ఉత్తర ప్రత్యుత్తరాలకు వారధిగా నిలిచిన పోస్టాఫీసు సేవలను నేటితరానికి తెలియజేసేందుకు తపాలాశాఖ నడుం బిగించింది. అందులో భాగంగానే ధాయ్ అఖర్ కార్యక్రమం నిర్వహిస్తుస్తోంది. నేటి తరానికి పోస్టాఫీసు సేవల గురించి చెప్పాలనే ఉద్దేశంతో శనివారం పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకుని నగరంలోని హెడ్‌పోస్టాఫీసుకు తీసుకొచ్చారు. అలాగే ధాయ్ అఖర్‌కు సంబంధించి ఈనెల 5వ తేదీన సాక్షి పత్రికలో "జ్ఞాపకాలను మరువ లేఖ" అనే శీర్షికంతో ప్రత్యేక కథనం ప్రచురించింది. ఈ నేపథ్యంలో గత వారం రోజులుగా పోస్టాఫీసుకు జనం విచ్చేస్తుండడంతో సందడిగా మారింది. శనివారం ఓ ప్రైవేటు పాఠశాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. అలాగే ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు కూడా పాల్గొన్నారు. ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలు పోస్టాఫీస్ వద్ద పోస్టుకార్డులను చేతపట్టుకున్న దృశ్యాలు ఉద్యోగులను, స్థానికులను ఆశ్చర్యపరిచాయి, గతంలో ఎన్నడూ లేని విధంగా పోస్టాఫీసు వద్ద ఇంత పెద్దఎత్తున తల్లిదండ్రులు, చిన్నారులు చేరడంతో అందరూ ఆసక్తిగా తిలకించారు. చిన్నారుల ఆసక్తి, ఆలోచనను చూసి ముక్కున వేలేసుకున్నారు.





లేఖను పోస్ట్‌బాక్స్‌లో వేస్తున్న చిన్నారులు, హెడ్ పోస్టాఫీస్ వద్ద ఉన్న పోస్ట్ బాక్స్ వద్ద చిన్నారుల సందడి

ఐ లవ్ యూ మమ్మీ.. డాడీ..

ఐ లవ్ యూ మమ్మీ అండ్ డాడీ.. అంటూ ముద్దు ముద్దు మాటలను చిన్నారులు పోస్ట్ కార్డు, ఎన్వలప్ కవర్లపై తల్లిదండ్రుల సహాయంతో చిట్టిచేతులతో తమ ఇంటి అడ్రస్‌కు లేఖరాయడం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు పోస్ట్ కార్డు ఎందుకు రాస్తారు ? దాని ప్రాధానత్య ఏంటి ? సెల్‌ఫోన్లు లేనప్పుడు ఉత్తరాల పాత్ర అనే అంశాలపై చిన్నారులను ఒడిలో కూర్చోబెట్టుకుని చెప్పడం చూపురులను ఆలోచింపజేసింది. పిల్లల స్వహస్తాలతో పోస్ట్‌కార్డులపై అక్షరాలను రాయించి స్వయంగా వారి చేతులతోనే కార్డులను పోస్ట్‌బాక్స్‌లో వేయించారు. పోస్ట్‌బాక్స్‌ను చూసి ఏంటి మమ్మీ ఇది అంటూ చిలిపి మాటలతో తల్లులను ప్రశ్నించారు. చిన్నారులు, తపాలా డబ్బా చుట్టూ కూర్చుని ఫోజులు ఇచ్చారు.

పోస్టాఫీసు వద్ద సందడి..

ఎప్పుడూ వెలవెలబోయే తిరుపతి నగరంలోని హెడ్ పోస్టాఫీసు వద్ద గత వారం రోజులుగా సందడి వాతావరణం ఏర్పడింది. కొందరు వ్యాసరచన పోటీలతో నిమిత్తం లేకుండా తమ పిల్లలకు గతంలో పోస్టాఫీసు అందించిన సేవలను తెలియజేస్తున్నారు. పోస్ట్‌కార్డు, ఇన్‌లాండ్ లెటర్ల గురించి అవగాహన కల్పిస్తున్నారు.

ఆసక్తిని చూసి గడువు పొడిగింపు



కేంద్ర తపాలాశాఖ ప్రజలు, విద్యార్థులకు అంతరించిపోతున్న ఇన్‌లాండ్ లెటర్, ఎన్వలప్ కవర్లపై అవగాహన కల్పించి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు దేశవ్యాప్తంగా 'ధాయ్ అఖర్' పేరిట చేపట్టిన వ్యాసరచన పోటీల గడువును పొడిగించింది. ఈనెల 14న శనివారంతో ముగిసిన గడువును వచ్చేనెల జనవరి 31వ తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు యువత, ప్రజలు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– బి.నరసప్ప, సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్, హెడ్ పోస్టాఫీస్ తిరుపతి

శాస్త్రోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు.

వైభవంగా సురాపాళ ఉత్సవం



తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న

నారాయణవనం: తమిళ కార్తీక పౌర్ణమి సందర్భంగా పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం సురాపాళ ఉత్సవాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం స్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామిని తిరుచ్చిపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. ఆంజనేయ స్వామి ఆలయం వద్ద భక్తులు తాటాకు మట్టలతో సిద్ధం చేసిన తాల వృక్షానికి సంప్రోక్షణ చేసి పూజలు చేశారు. అనంతరం తాల వృక్షాన్ని అగ్నికి ఆహుతి చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ దేవ దానవులు మధించిన క్షీర సాగరంలో ఉద్భవించిన అమృతాన్ని మహావిష్ణువు మోహినీ అవతారమెత్తి దేవతలకు పంచిపెట్టారని తెలిపారు. దేవతలు తిరిగి వెళుతూ స్వర్గ ద్వారాన్ని పూజించి సంబరాలు జరుపుకున్నారని పేర్కొన్నారు. ఈ ఘట్టాన్ని దర్పణంపడుతూ తాల వృక్షాన్ని అగ్నికి ఆహుతి చేసి సురాపాళం ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవ మూర్తులకు ఆస్థానం నిర్వహించారు. స్థానిక ఆలయాల సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్, ఆలయ భద్రతా జమేదార్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

16న 'పడమటిగాలి' నాటక ప్రదర్శన



పడమటి గాలి నాటక కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: దేశానికి రైతు ఆవశ్యకతను ఆవిష్కరించే.. అత్యంత ప్రజాదరణ కలిగిన 'పడమటి గాలి' నాటక ప్రదర్శన ఈనెల 16వ తేదీన సాయంత్రం 6 గంటలకు మహతి కళాక్షేత్రంలో ప్రదర్శిస్తున్నట్లు బీసీ సంఘర్షణ సమితి నేతలు తెలిపారు. ఈమేరకు శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పడమటి గాలి నాటక కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ గత 25 ఏళ్లగా దేశవ్యాప్తంగా 150కిపైగా ప్రదర్శనలతో ఈ నాటకం అత్యంత ప్రజాదరణ పొందిదన్నారు. సామాన్య రైతు కుటుంబంలో ఉండే సాధక బాధలను ఈ నాటికలో కళ్లకు కట్టినట్లు కళాకారుల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. రైతు ఆవశ్యకత సమాజానికి ఎంత అవసరమో అనే విషయం తెలిసేలా నిర్వహిస్తున్న ఈ నాటకాన్ని ప్రజలు తిలకించి మరింత ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో బీసీ సంఘర్షణ సమితి నేతలు సాకం ప్రభాకర్, కట్టమంచి చంద్రబాబు, డిష్ రమణ, కరాటే చంద్ర పాల్గొన్నారు.

ఈఈఈ విభాగ అధ్యక్షుడు చెంగయ్య తొలగింపు

తిరుపతి సిటీ: ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఈఈఈ విభాగ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ప్రొఫెసర్ చింతపూడి చెంగయ్యను ఆ పదవి నుంచి తొలగిస్తూ శనివారం వర్సిటీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు ఆధ్వర్యంలో ప్రిన్సిపల్స్, వైస్ ప్రిన్సిపల్స్ సభ్యులుగా నియమితులైన హైపవర్ కమిటీ రెండురోజులుగా సమావేశమై ప్రొఫెసర్‌పై ఉన్న మహిళా వేధింపు కేసు, మత ప్రచార ఆరోపణ కేసులపై కమిటీ నివేదిక చర్చించింది. ప్రధానంగా ఆచార్య ఉషా రెడ్డి ఫిర్యాదు మేరకు వర్సిటీ అధికారులు నియమించిన కమిటీ విచారణలో మహిళను వేధించినట్టు నిరూపణ కావడం, అలాగే వారం కిందట జరిగిన 'మత ప్రచారం–అధ్యాపకుడిపై దాడి' ఘటనపై నియమించిన ఫ్యాక్ట్ ఫైండ్ కమిటీ రిపోర్టర్‌ను సైతం పరిగణనలోకి తీసుకుని విభాగ అధ్యక్ష పదవి నుంచి తొలగించారు. ఆయన ఇక ప్రొఫెసర్‌గా మాత్రమే కొనసాగనున్నారు. ఈఈఈ తాత్కాలిక విభాగ అధ్యక్ష బాధ్యతలు కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.శ్రీనివాస్ రెడ్డికి అప్పగించారు. ఆయనపై కమిటీలు ఇచ్చిన నివేదికను, తీసుకున్న చర్యలపై రాజ్‌భవన్ అధికారులకు, ప్రభుత్వానికి, ఉన్నత విద్యామండలికి వర్సిటీ అధికారులు నివేదిక సమర్పించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేద్దాం



గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీకాళహస్తి న్యాయస్థానం 12వ జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ అన్నారు. కోర్టు ఆవరణలో శనివారం బాల్యవివాహాల నిర్మూలనపై గోడ పత్రికలను ఆవిష్కరించారు. న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ 2004 నుంచి ఎన్నో పోరాటాలను చేస్తూ బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేస్తున్న బాల్య వివాహ వ్యతిరేక పోరాట సమితి కృషి అభినందనీయమన్నారు. కోటయ్య, పులి శ్రీకాంత్, మల్లికార్జున్, సుబ్రహ్మణ్యం, వేణు, చెంచురామిరెడ్డి, ఈశ్వరయ్య, గంగయ్య పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న కారు

ఓజిలి: మండలంలోని రాచపాళెం క్రాస్ రోడ్డు సమీపంలో శనివారం లారీని కారు ఢీకొంది. పోలీసుల కథనం మేరకు.. కోట మండలం కర్లపూడికి చెందిన దంపతులు సూళ్లూరుపేట నుంచి కారులో బయలుదేరారు. రాచపాళెం క్రాస్ రోడ్డు సమీపంలో రోడ్డును క్రాస్ చేస్తున్న లారీని ఢీకొన్నారు. దీంతో కారు ముందుభాగం దెబ్బతినింది. ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కారు, లారీను స్టేషన్‌కు తరలించారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం

రామచంద్రాపురం: మండలంలో శనివారం నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మొత్తం 12 చెరువులకు గానూ 72 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ ఇందిర, ఇరిగేషన్ ఏఈ ఎత్తిరాజు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. స్థానిక ఎస్‌ఐ రామాంజనేయులు పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రాయలచెరువుకు అధ్యక్షుడిగా అర్జున్ నాయుడు, ఉపాధ్యక్షుడిగా గంగయ్య, అనుప్పల్లి చెరువుకు అధ్యక్షుడిగా జగదీష్, ఉపాధ్యక్షుడిగా త్యాగరాజులు, కుప్పంబాదూరు చెరువుకు అధ్యక్షుడిగా దొరస్వామి నాయుడు, ఉపాధ్యక్షుడిగా నరసింహులు, కోడి చెరువుకు అధ్యక్షురాలిగా మల్లేశ్వరమ్మ, ఉపాధ్యక్షురాలిగా కస్తూరమ్మ, పుల్లాట్ల వాగు చెరువుకు అధ్యక్షుడిగా తులసిబాబు నాయుడు, ఉపాధ్యక్షుడిగా రాజశేఖర్‌రెడ్డి, పిల్లారి కోన చెరువుకు అధ్యక్షుడిగా కృష్ణయ్య, ఉపాధ్యక్షుడిగా భాస్కర్‌నాయుడు, అమ్మగారి చెరువుకు అధ్యక్షుడిగా మధుసూదన్, ఉపాధ్యక్షురాలిగా నీరజ, బొప్పరాజుపల్లి చెరువుకు అధ్యక్షుడిగా హనుమంతయ్య యాదవ్, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణారావు, సంగటిముద్దల కోన చెరువుకు అధ్యక్షుడిగా కుప్పస్వామినాయుడు, ఉపాధ్యక్షుడిగా నాగేశ్వర్‌రావు, గుండాలవంక చెరువుకు అధ్యక్షుడిగా నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడిగా కృష్ణయ్య, అన్నాస్వామి గండి చెరువుకు అధ్యక్షుడిగా శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి, తీత్రకొన చెరువుకు అధ్యక్షుడిగా నాదమునిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా మునిరత్నం నాయుడు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, వీరికి ఎన్నికల అధికారులు నియామక పత్రాలు అందజేశారు. వీరిని పలువురు అభినందించారు.



ఎన్నికైన సాగునీటి సంఘ కమిటీలతో ఎన్నికల అధికారులు



నీటి సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్న అధికారులు

పాకాలలో ప్రశాంతంగా ఎన్నికలు

పాకాల : మండలంలో ప్రధానంగా ఉన్న 9 చెరువులకు నిర్వహించిన నీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. శనివారం చంద్రగిరి ఇరిగేషన్ డీఈ రెడ్డి సురేష్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. సామిరెడ్డిపల్లి గ్రామంలోని పాకాల పెద్దచెరువుకు ఆర్.అర్జున్‌రెడ్డి, గానుగపెంట గ్రామంలోని రామసముద్రం చెరువుకు బి.నరసింహులు, దామలచెరువులోని కమ్మవెంట్రాయుని చెరువుకు వి.వేణుగోపాల్, కోనేటి చెరువుకు వి.జయచంద్రనాయుడు, రమణయ్యగారిపల్లిలోని వెంకట్రాయుని చెరువుకు జి.పీరుల్లాసాహెబ్, గాదంకి గ్రామంలోని కానుగులవంక ట్యాంక్‌కు రామ్మూర్తిరెడ్డి, గుడివారిపల్లిలోని పట్టికొండ వంక, గుట్టవారవంక ట్యాంక్‌కు జి.హరినాథ్, పదిపుట్లబైలు రిజర్వాయర్‌కు బి.నరసింహులు చైర్మన్లుగా ఎన్నికయ్యారు. అలాగే ఆయా చెరువులకు వైస్ చైర్మన్లు, మెంబర్లు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బహిష్కరించినా హౌస్ అరెస్టులా ?



తిరుపతిలో హౌస్ అరెస్ట్ లో మాజీ సర్పంచ్ చెంగల్‌రెడ్డి

భాకరాపేట : సాగునీటి సంఘాల ఎన్నికల్లో రాష్ట్రప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఈ ఎన్నికలను బహిష్కరించింది. అయితే శనివారం చంద్రగిరి నియోజకవర్గంలోని ఎర్రావారిపాళెం మండలంలో జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నేతలు పోటీ చేస్తారని పోలీసులు నాయకులను హౌస్ అరెస్ట్ చేశారు. అలాగే చిన్నగొట్టిగల్లు మండలంలో కూడా వైఎస్సార్‌సీపీ నాయకులకు తెల్లవారుజామున ఫోన్లు చేసి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారా ? అని అడిగి తెలుసుకున్నారు. అయితే పోటీలో లేకపోవడంతో అప్పటికే వైఎస్సార్‌సీపీ నేతల హౌస్ అరెస్టుకు బయలుదేరిన పోలీసులు వెనుదిరిగినట్లు సమాచారం. తిరుపతిలో కాపురం ఉంటున్న ఎర్రావారిపాళెం మాజీ సర్పంచ్ చెంగల్‌రెడ్డిని తిరుపతిలోనే హౌస్ అరెస్ట్ చేశారు. పలువురు నాయకులను ఇళ్లల్లో నుంచి బయటకు రాకుండా పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. సాగునీటి సంఘాల ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినా వినకుండా పోలీసులు హౌస్ అరెస్టులు చేయడం గమనార్హం.

మీకు చేతకాక వైఎస్సార్‌సీపీపై ఆరోపణలా ?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత, టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు యాదవ్

తిరుపతి కల్చరల్: కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య ఉండడంతో పాటు తిరుపతికి జనసేన పార్టీ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ స్థానికులకు వైకుంఠ ద్వారదర్శనం కల్పించే సత్తాలేక జనసేన నేత కిరణ్ రాయల్ వైఎస్సార్‌సీపీపై తప్పుడు ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని ఆ పార్టీ నేతలు వై.వాసుయాదవ్, పసుపులేటి సురేష్ ఎద్దేవా చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అత్యంత పవిత్రమైన పర్వదినం వైకుంఠ ద్వారదర్శన భాగ్యం స్థానికులకు కల్పించాలని వారు కోరడం తప్పు కాదన్నారు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి వైకుంఠ ద్వారదర్శనం టిక్కెట్లను కర్ణాటక, తమిళనాడు, గుజరాత్ వారికి అమ్ముకున్నారని విమర్శలు చేయడం దుర్మార్గమన్నారు. స్థానిక ఎమ్మెల్యేగా భూమన కరుణాకరరెడ్డి వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా పది రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనం సౌకర్యం కల్పించి స్థానికులకు అత్యధికంగా వైకుంఠ ద్వారదర్శన భాగ్యం కల్పించారన్నారు. తిరుమల, తిరుపతిలోని 10 కేంద్రాల్లో 94 కౌంటర్లు ఏర్పాటు చేసి లక్షలాది మంది స్థానికులకు వైకుంఠ ద్వారదర్శనం కల్పించిన విషయం స్థానిక ప్రజలకు తెలుసు అన్నారు. దళారీతనంతో టిక్కెట్లు అమ్ముకున్నారని తప్పుడు ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. అయితే అధికార పార్టీకి చెందిన నేతలే స్థానికులకు దర్శనం కల్పించే విషయంపై మీడియా ముందు డిమాండ్ చేయడం కూటమిలో వారి అనైక్యతకు నిదర్శనమన్నారు. కూటమి పాలనలో నియమితులైన అధికారులు, ఎమ్మెల్యేకు తిరుపతి స్థానికులకు వైకుంఠ ద్వారదర్శనం కల్పించడం చేతకాక వైఎస్సార్‌సీపీపై బురద జల్లడం దారుణమన్నారు. సమావేశంలో టౌన్ బ్యాంక్ డైరెక్టర్లు అమరనాథ్‌రెడ్డి, మాకం చంద్ర, విద్యార్థి సంఘం నేతలు ప్రేమ్, ముని, 14వ డివిజన్ అధ్యక్షుడు అనిల్ పాల్గొన్నారు.

ఘంటసాల గేయాలతో పులకించిన మహతి



ఘంటసాల పాటలను సుమధురంగా గానం చేస్తున్న గాయకులు

తిరుపతి కల్చరల్: అమర గాయకుడు ఘంటసాల పాడిన పాటలను గాయనీ గాయకులు సుమధుర గానంతో ఆలపించగా మహతి కళాక్షేత్రం పులకించింది. ఆణిముత్యం లాంటి ఆనాటి పాటలను గాయకులు తమ గాత్రంతో శ్రోతల హృదయాలను ఓలలాడించారు. టీటీడీ సహకారంతో తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన ఘంటసాల పాటల సంగీత విభావరి శనివారంతో రెండవ రోజుకు చేరుకుంది. టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, పీసీఆర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ డాక్టర్ పీసీ రాయులు, టీడీపీ నేత నరసింహయాదవ్, బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ మేనేజర్ మునిశేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఘంటసాల సంగీత వైభవాన్ని, పాటల మాధుర్యాన్ని గురించి కొనియాడారు. నాటి ఘంటసాల పాటలను నేటి తరానికి అందిస్తున్న తిరుపతి ఫిలిం సొసైటీ ప్రతినిధులు అభినందనీయులన్నారు. అనంతరం భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ మహతి వంటి చిన్న ఆడిటోరియం నిర్మించి, దానికి అన్నమయ్య కళాక్షేత్రంగా నామకరణం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం గాయనీగాయకులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా గాయనీ గాయకులు సుమనాస్, సాయిశశాంక్, రాజు, ప్రజ్వల, ప్రవస్తి తమదైన శైలిలో ఘంటసాల పాటలను గానం చేస్తూ ప్రేక్షకులను ఆనంద డోలికల్లో ముంచెత్తారు. కార్యక్రమంలో తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, అధ్యక్షుడు వైఎస్ బాబు, కార్యదర్శి సీఆర్‌కే శేషగిరిరావు, కోశాధికారి ప్రసాద్‌రావు, గుల్జార్, బుజ్జిబాబు నాయుడు, సుబ్రమణ్యం, అనసూయ, భాస్కర్, రాజ్యలక్ష్మి, శాంతావాణి పాల్గొన్నారు.